క్లుప్తంగా

ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి

మొయినాబాద్‌రూరల్: ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి చరణ్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే విద్యాసంవత్సరానికి ఇప్పటి నుంచే అడ్మిషన్లు చేసుకుంటున్నారని, తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. అలాంటి విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు, కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ జన్మదిన వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా కార్యాలయంలో ఆదివారం బీజేపీ జాతీయ నాయకురాలు, పాలమూరు ఎంపీ డీకే అరుణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య హాజరై కేక్ కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు వంశీకృష్ణ, రిషి, హరి భూషణ్, కుర్మయ్య, ప్రశాంత్, నర్సింలు, సురేష్, రఘుగౌడ్, కాసోజు శివ, ఎల్లయ్య, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీకి శుభాకాంక్షలు



ఎంపీ అరుణను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ జన్మదినోత్సవం సందర్భంగా పట్టణ బీజేపీ నాయకులు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు షాద్‌నగర్ నుంచి మహబూబ్‌నగర్‌లోని ఎంపీ నివాసానికి తరలివెళ్లి ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, విజయ్‌భాస్కర్, మోహన్‌సింగ్, చేగు సుధాకర్, చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి, రాజు, మహేందర్‌రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, మిద్దె గణేశ్, రంగన్నగౌడ్, వెంకటేశ్, రాజు నాయక్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చుతున్న విద్యుత్ సిబ్బంది

కొందుర్గు: మండలంలోని ముట్పూర్ ఎస్సీ, బీసీ కాలనీల్లో గత కొంతకాలంగా లోఓల్టేజీ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి లోఓల్టేజీ సమస్యతో గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి ముట్పూర్‌కు రెండు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్ సహకారంతో సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చారు. ఈ మేరకు గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

గుండెపోటుతో కాంగ్రెస్ నాయకుడి మృతి

చేవెళ్ల: గుండెపోటుతో ముడిమ్యాల కాంగ్రెస్ నాయకుడు కొరే రాజు(43) ఆదివారం మృతి చెందాడు. మండలంలోని ముడిమ్యాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కొరే సువర్ణ కుమారుడు కొరే రాజు కొంత కాలంగా భార్యపిల్లలతో కలిసి చేవెళ్లలో నివాసం ఉంటున్నాడు. గతంలో మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశాడు. ప్రస్తుతం గ్రామంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుడిగా ఉన్నాడు. ఆదివారం ఉదయం ఛాతిలో నొప్పి వస్తుందని చెప్పడంతో వెంటనే కుటుంబసభ్యులకు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మండలంలోని కాంగ్రెస్ నాయకులు అతని మృతికి సంతాపం ప్రకటించారు. సోమవారం ముడిమ్యాలలో ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

పశువులకు ‘లంపీ’ ముప్పు

- ఆవుజాతి లేగదూడల్లో కనిపిస్తున్న ముద్దచర్మం వ్యాధి లక్షణాలు
- ఆందోళనలో పాడి రైతులు
- జాగ్రత్తలు అవసరమంటున్న పశువైద్య నిపుణులు



చందనవెల్లిలో వ్యాధికి గురైన లేగదూడ

షాబాద్: పాడి పశువులకు, లేగ దూడలకు సోకుతున్న వ్యాధుల్లో ప్రాణాంతకమైన లంపీస్కిన్ (ముద్దచర్మం) వ్యాధి మండలంలో మళ్లీ బయటపడింది. వ్యాధి లక్షణాలు తెల్లజాతి పశువుల్లో కనిపిస్తుండటంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడేళ్ల క్రితం విస్తరించి పాడి రైతులను ఆందోళనకు గురిచేసింది. పశువుల్లో మళ్లీ లక్షణాలు కనిపిస్తున్నాయి. ఒకటి రెండు చోట్ల లేగదూడలు మృత్యువాతపడిన ఘటనలు కూడా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. మండలంలో మొత్తం 9 వేల ఆవులు, లేగదూడలు ఉన్నాయి.

ఎలా ప్రబలుతుందటే..

వైరస్‌తో వ్యాధి సోకుతుంది. ఈగలు, దోమలు, పిడుదులు, గోమార్ల వంటి వాటి ద్వారా వ్యాప్తి చెందుతుంది. తెల్లజాతి పశువులైన ఆవులు, ఎద్దులపై వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. గేదెల్లోనూ ప్రబలుతుంది. టీకా వేస్తే ఏడాదిపాటు వ్యాధి సోకదు.

వ్యాధి లక్షణాలు

- పశువుల శరీరంపై 2 నుంచి 5 సెంటిమీటర్ల విస్తీర్ణంలో గుండ్రంగా దద్దుర్లు, కురుపులు ఏర్పడతాయి.
- పశువులకు జ్వరం వస్తుంది. ఆకలి మందగించి మేత సరిగా యేయవు.
- పాల ఉత్పత్తి తగ్గుతుంది.
- చూడి పశువుల్లో గర్భస్రావం జరుగుతుంది.
- చికిత్స అందకపోతే పశువులు మరణించే అవకాశాలు ఉన్నాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

రైతులంతా పశువుల చావిడి శుభ్రంగా ఉంచుకోవాలి. క్రిమికీటకాలు, దోమలు, ఈగలు రాకుండా జాగ్రత్తపడాలి. పశువుల కొట్టాలు, పరిసరాల్లో క్రిమిసంహారక మందులను పిచికారీ చేయాలి. లంపీస్కిన్ వ్యాధి వచ్చిన పశువుల చర్మంపై పొక్కులు, నోట్లో బొబ్బర్లు, తీవ్రమైన జ్వరం వస్తుంది. ఈ వ్యాధి సోకిన జంతువులు మరో జంతువుతో సన్నిహితంగా ఉండకుండా జాగ్రత్త వహించాలి. తప్పని సరిగా టీకాలు వేయించాలి.

అందుబాటులో టీకాలు

గతంలో ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన పశువులతో పాటు వాటి పరిసరాల్లో 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న వాటికి ఎల్‌ఎస్‌డీ టీకాలు వేశారు. ప్రతీ పశువైద్య ఆస్పత్రుల్లో ఎల్‌ఎస్‌డీ టీకా మందులు అందుబాటులో ఉన్నాయి. పుట్టిన దూడలకు రైతులు మందుకొచ్చి టీకాలు వేయించాలి. పూర్తి స్థాయిలో ఆవుజాతి పశువులకు టీకాలు వేయించక పోవడంతో మళ్లీ లంపీస్కిన్ సోకుతుందని పశు వైద్యాధికారులు పేర్కొంటున్నారు.



కుమ్మరిగూడలో వ్యాధి సోకిన లేగదూడ

టీకాలు వేయాలి

నాకు ఆవులు, లేగదూడలు, ఎద్దులు అన్నీ కలిపి 10 వరకు ఉన్నాయి. లేగ దూడలకు లంపీ స్కిన్ సోకింది. చికిత్స చేయిస్తున్నాను. మిగతా వాటికి సోకకముందే అధికారులు దూడలకు టీకాలు వేయాలి.

–మల్లయ్య, రైతు, చందనవెల్లి

అప్రమత్తం చేశాం



మండలంలో మళ్లీ లంపీ స్కిన్(ముద్ద చర్మ) వ్యాధి లక్షణాలు మళ్లీ బయటపడుతున్నాయి. ఇప్పటికే పశువైద్యులు, సిబ్బందిని అప్రమత్తం చేశాం. రైతులు జాగ్రత్తగా ఉండాలి. లక్షణాలు కనపడగానే పశువును మంద నుంచి వేరుచేసి క్వారంటైన్‌లో ఉంచాలి. ఆస్పత్రుల్లో టీకాలు అందుబాటులో ఉన్నాయి. రైతులు లేగ దూడలకు తప్పని సరిగా టీకాలు చేయించాలి.

–చంద్రశేఖర్‌రెడ్డి, మండల పశువైద్యాధికారి

సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని వినాయక గంజ్‌లో కాంగ్రెస్ పార్టీ నేత రవిముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి నిత్యం పట్టణంలో ఉన్న గంజ్‌కు వివిధ పనులు, వ్యాపార నిమిత్తం అనేక మంది గ్రామాల నుంచి ప్రజలు వస్తుంటారన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు చల్లనినీరు అందించేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. యువత, పార్టీ నాయకులు సేవా కార్యక్రమాలు చేయడంలో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, నాయకులు బస్వం, జమృద్‌ఖాన్, కొమ్ము కృష్ణ, నర్సింలు, ప్రదీప్ మరాటియా, భరత్ లోహటి, వాసు, మనీశ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా కాంగ్రెస్

ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్



బాధితురాలికి చెక్కు అందిస్తున్న భాస్కర్‌గౌడ్

కేశంపేట: కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు అండగా ఉంటుందని మార్కెట్ కమిటీ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామానికి చెందిన బండ వెంకటమ్మ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందింది. నిరుపేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.33వేలను మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఆ చెక్కును ఆదివారం భాస్కర్‌గౌడ్ గ్రామస్తుల సహకారంతో బాధితురాలి కుటుంబ సభ్యులకు అందించాడు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు శ్రీశైలం, ఖాజాపాషా, జంగయ్య, ముత్యాలు, మల్లయ్య, రాజేందర్, రామకృష్ణ, బద్రునాయక్, కొడూరు రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

షాద్‌నగర్‌రూరల్: వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు 5వ తేదీ సోమవారం నుంచి ఏర్పాటు చేయనున్న ఉచిత శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ మనోహర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ శిబిరాలను మండల పరిధిలోని వెలిజర్ల, చించోడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 5 నుంచి 19 వరకు(15రోజులు) ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ శిబిరంలో విద్యార్థులకు వినోదాన్ని అందించే కార్యక్రమాలతో పాటుగా మేథోశక్తిని పెంపొందించేందుకు శిక్షణ ఇస్తామని వివరించారు. ఆర్ట్, సంగీతం, పాఠ్యాంశాలలోని సందేహాలను నివృత్తి చేసేందుకు నిష్ణాతులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ ఉచిత శిక్షణ శిబిరాన్ని పరిసర గ్రామాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



ఇళ్ల మధ్యన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

కొత్తూరు: మండల కేంద్రంలోని నారాయణ గూడ కాలనీలో ప్రధాన రోడ్డు పక్కన ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. నిత్యం ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో నుంచే వందలాది మంది సంచరిస్తుంటారని తెలిపారు. ప్రజలు ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించిన ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆరోపిస్తున్నారు. గతంలో పలుమార్లు సంబంధిత శాఖలకు చెందిన అధికారులకు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని కోరారు.

బీఆర్‌ఎస్ యువ నాయకుడి జన్మదిన వేడుకలు

షాద్‌నగర్‌రూరల్: బీఆర్‌ఎస్ యువనాయకుడు, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ తనయుడు మురళీకృష్ణయాదవ్ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణయాదవ్ అభిమానులు ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్(ఎఫ్‌సీఐఎన్)లో వృద్ధులకు అల్పాహారం అందించారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ నాయకులు పట్టణంలో గల ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కేక్ కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు యుగేందర్, పిల్లి శేఖర్, జూపల్లి శంకర్, యాదగిరి, నందిగామ శ్రీనివాస్, మల్లేష్, సుశాంత్, మల్లేష్, సాయి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–01లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. అజీజ్‌నగర్ సమీపంలో గల ఓ ఫంక్షన్‌హాల్‌లో కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారందరూ పాఠశాల స్థాయి జ్ఞాపకాలను నెమరువేసుకొని రోజంతా ఆటాపాటలతో సందడిగా గడిపారు. సిల్వర్ జూబ్లీ జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బండ్లగూడ శ్రీధర్, చిరంజీవి, రవి, మల్లేశ్, ప్రభాకర్, సుధాకర్, కవిత, సుజాత, మంజుల, వనజ, సుమలత, నహీద్, రషీదాబి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరిస్తున్న ప్రభుత్వం

కొందుర్గు: ఇళ్లు లేని పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి ఊరిస్తూ వస్తుందే తప్పా ఎక్కడ కూడా ఇప్పటివరకు పునాది రాయి వేసింది లేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య విమర్శించారు. ఆదివారం మండలంలోని మహదేవ్‌పూర్‌లో సీపీఐ మండల కార్యదర్శి బాగళ్ల నర్సింహ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లు కావొస్తున్నా నేటికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించలేదని, ఇంకా సర్వేల పేరుతోనే కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు మహిళలకు ఉచిత బస్సు తప్పా ఏ హామీ సరిగా అమలు కావడం లేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే సీపీఐ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు యాదయ్య, రవి, కిష్టయ్య, వెంకటయ్య, విజయ తదితరులు పాల్గొన్నారు.

కులగణన నిర్ణయంపై హర్షం



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

కొత్తూరు: కేంద్ర ప్రభుత్వం కులగణనకు అనుకూలంగా ఆమోదించడంపై మండల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ఆదివారం కొత్తూరు పట్టణంలో మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎంపీ డీకే అరుణ జన్మదినం సందర్భంగా కొత్తూరు పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే దేశం అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చే విధంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అమడపురం నర్సింహాగౌడ్, మాణిక్యం, పాలకొండ అశోక్‌గౌడ్, రాఘవులు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించుకుంటాం.. ‘దారి’వ్వండి

ఓడీఎఫ్ ఉద్యోగుల ఆవేదన



సర్వే నం.51లో ప్లాట్లు చేసుకున్న ఓడీఎఫ్ ఉద్యోగులు

శంకర్‌పల్లి: గతంలో గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు చేసుకున్న లేఅవుట్‌కు రోడ్డు లేకుండా కబ్జా చేశారని, మాకు రోడ్డు ఇప్పిస్తే ఇళ్లు నిర్మించుకుంటామని కొంతమంది ఓడీఎఫ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. 1991–92లో సింగాపురం(ప్రస్తుతం శంకర్‌పల్లి మున్సిపాలిటీ) గ్రామంలోని సర్వే నం.51లో మూడెకరాల ఎనిమిదిన్నర గుంటల భూమిని కొంతమంది ఓడీఎఫ్ ఉద్యోగులు కలిసి కొనుగోలు చేశారు. అనంతరం దానిని లేఅవుట్‌గా చేసి, 58 ప్లాట్లుగా మార్చారు. ఈ లేఅవుట్‌కు శంకర్‌పల్లి నుంచి సంగారెడ్డివైపు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఉన్న సర్వే నం.52లో నుంచి ఉంది. అయితే ఆ సర్వే నంలో అప్పటికే లేఅవుట్ చేసి, 30ఫీట్ల రోడ్డు వేసి ఉంది. దానిని ప్రధాన రహదారిగానే చూపుతూ వీరు లేఅవుట్ చేసుకొని గ్రామ పంచాయతీ నుంచి అనుమతి తీసుకున్నారు. కాలక్రమేణా సర్వే నం.52లోని రహదారిని కొంతమంది వ్యక్తులు తమదని స్వాధీనం చేసుకున్నారు. దీంతో మా లేఅవుట్‌కు వెళ్లేందుకు దారి లేకుండా పోయిందని, దీనిపై విచారణ జరపాలని కోరుతున్నారు. ఇప్పటికే దీనిపై మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్‌లకి ఫిర్యాదు చేసినట్లు స్పష్టం చేస్తున్నారు. అధికారులు తమ సమస్యపై స్పందించి, రోడ్డు ఇప్పిస్తే ఇళ్లు నిర్మించుకుంటామని కోరుతున్నారు.

ఘనంగా మల్లన్న బోనాలు



దామరగిద్దలో బోనాల ఊరేగింపు



దేవునిఎర్రవల్లిలో మల్లన్నకు పూజలు చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

చేవెళ్ల: మండలంలోని దేవునిఎర్రవల్లి, దామరగిద్ద గ్రామాల్లో ఆదివారం మల్లన్న బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయాల్లో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు జరిగాయి. దేవునిఎర్రవల్లిలో జరుగుతున్న ఉత్సవాల్లో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పాల్గొని మల్లన్నకు పూజలు చేశారు. అనంతరం మహిళలు డప్పుచప్పుళ్ల మధ్య బోనాల ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువకుల కేరింతలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు డి.శర్వలింగం, నాయకులు ఎ.శ్రీనివాస్, అంజనేయులు, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మండల నాయకులు, గ్రామాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

- నేటి నుంచి జూన్ 13వ తేదీవరకు అన్నదాతలకు అవగాహన కార్యక్రమాలు
- సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారుల సూచన



చేవెళ్ల డివిజన్ వ్యవసాయ కార్యాలయం

చేవెళ్ల: ప్రభుత్వం అన్నదాతలకు సాగు విధానంపై అవగాహన కల్పించాలనే ఆలోచనతో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఏఓ శంకర్‌లాల్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు నూతన వ్యవసాయ సాంకేతికను అందించాలనే లక్ష్యంతో మే 5 నుంచి జూన్ 13వ తేదీవరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన ప్రధాన శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లోకి వచ్చి వానాకాలంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటిచాల్సిన పద్ధతులు గురించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

రైతులకు అందించే వివరాలు..

ఈ రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల అవగాహన కార్యక్రమాలకు వచ్చే శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు నూతన సాంకేతిక అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఇందులో యూరియ వాడకం తగ్గించడం, అధిక రసాయన ఎరువుల వాడకంతో కలిగే నష్టాలు, నాణ్యమైన విత్తనాల ఎంపిక, విత్తనాలను విత్తే ముందు చికిత్స చేయటం, సాగునీటి సద్వినియోగం, భూగర్భజలాల పరిరక్షణ, పంటల మార్పిడి, చెట్ల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, జీవసారాన్ని పెంచి నేల ఆరోగ్యాన్ని పునరుద్ధరించటం, పోషకాలు, పోషణను మెరుగుపర్చేందుకు జీవ ఎరువుల వినియోగం, పంట అవశేషాలను యాంత్రీకరణ ద్వారా నిర్వహించటం, రైతులు కొనుగోలుచేసే ప్రతి దానికి రశీదులు పొంది వాటిని భద్రపరచటం, కష్టకాలంలో నష్టపరిహారాన్ని పొందటం, సాగునీటిని ఆదాచేసి భవితారలకు అందించటం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయి.

కార్యక్రమాల షెడ్యూల్

చేవెళ్ల మండలంలోని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఏఓ శంకర్‌లాల్ విడుదల చేశారు. ఇందులో భాగంగా మండలంలో 5వ తేదీన ప్రారంభోత్సవ కార్యక్రమం, మే 6వ తేదీన చనువెల్లి, 8న గొల్లపల్లి, 16న ఈర్లపల్లి, రావుపల్లి, 23న ఆలూరు, 26న అల్లవాడ, 27న గుండాల, 30న కౌకుంట్ల, జూన్ 3న కందవాడ, 4న ముడిమ్యాల, 6న ఇబ్రహీంపల్లి, ఖానాపూర్, 9న ఊరేళ్ల, 10న దేవునిఎర్రవల్లి, 16న పామెన, చేవెళ్ల గ్రామాల్లో ఈ అవగాహన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఆయా గ్రామాల్లో నిర్వహించే ఈ అవగాహన కార్యక్రమాల్లో రైతులు పెద్దసంఖ్యలో పాల్గొని నూతన వ్యవసాయ సాంకేతికతపై విస్తృత అవగాహన పొందాలని కోరారు.

శంకర్‌పల్లి మండలంలో..

శంకర్‌పల్లి: మండలంలోని రైతులకు శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు శంకర్‌పల్లి ఇన్‌చార్జి వ్యవసాయాధికారి సురేశ్‌బాబు తెలిపారు. మండలంలో ఈ నెల 5న లక్ష్మారెడ్డిగూడ, 8న ఎర్వగూడ, 23న టంగటూర్, 30న రావులపల్లికలాన్, జూన్ 6న గోపులారం, 13న పర్వేద గ్రామాల్లో సదస్సులు ఉంటాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేటి నంచి అవగాహన సదస్సు

మొయినాబాద్‌రూరల్: 5వ తేదీ నుంచి గ్రామాల్లో రైతులకు శాస్త్రవేత్తలతో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని మండల వ్యవసాయ అధికారి అనురాధ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఆదివారం మాట్లాడుతూ.. మండల, మున్సిపల్ పరిధిలో ఈ అవగాహన కార్యక్రమాలు ఇలా.. మొదటిరోజు పెద్దమంగళారం, 6న కనకమామిడి, 7న నక్కలపల్లి, 13న తోల్‌కట్ట, 14 చిన్నమంగళారం, 15వ తేదీన చిలుకూరు, 16వ తేదీన సురంగల్, 19 కేతిరెడ్డిపల్లి, 20 నాగిరెడ్డిగూడ, 21 అజీజ్‌నగర్, 24 చెందానగర్, 26 మోత్కుపల్లి, 27 చిన్నషాపూర్, 28 ఎన్కెపల్లి, 31 వెంకటాపూర్, జూన్ 2న రెడ్డిపల్లి, 4న బాకారం, 6 శ్రీరామ్‌నగర్, 10 అమ్డాపూర్, 11 ముర్తుజాగూడ, 13 సజ్జన్‌పల్లి గ్రామాల్లో వ్యవసాయ పరిశోధన ప్రధాన శాస్త్రవేత్తలు తేదీల వారీగా గ్రామాలను సందర్శించి అధికారులతో కలిసి రైతులకు నూతన వ్యవసాయ సాంకేతికపై విస్తృత అవగాహన కల్పిస్తారని తెలిపారు.